క్లుప్తంగా

23, 24న మండలస్థాయి స్కూల్ గేమ్స్

యద్దనపూడి: మండలంలో క్రీడా సందడి మెదలుకానుంది. మండలంలోని పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23,24 తేదీల్లో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పీఈటీ అంకరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14,17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్ , షటిల్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలిచిన విజేతలకు నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు ప్రారంభం

చీరాల అర్బన్: చీరాల మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండ్-14, 17 బాలుర, బాలికల ఆటల పోటీలను శుక్రవారం చీరాల మండలం జాండ్రపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని క్రీడాస్థలంలో ప్రారంభమవుతాయని మండల కన్వీనర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుగొండ పూర్ణచంద్రరావు గురువారం తెలిపారు. పోటీలలో అన్ని యాజమాన్యాల కింద పనిచేస్తున్న ఉన్నత పాఠశాలల పాల్గొనవచ్చన్నారు. శుక్రవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, శనివారం అన్ని రకాల అథ్లెటిక్స్ జరుగుతాయన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, చీరాల మండల విద్యాధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావులు హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేస్తున్న పాఠశాలల విద్యార్థులు పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు ప్రజా వేదిక కార్యక్రమం

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మిన్నెకల్లు సచివాలయం వద్ద నిర్వహించనున్న ప్రజా వేదిక కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో 100 రోజుల కార్యక్రమం గురించి వివరిస్తూ ప్రజావేదిక కార్యక్రమం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాఠశాలలో కుళాయిలు ప్రారంభం



కుళాయిలు ప్రారంభిస్తున్న దాతలు

వేటపాలెం: పాఠశాలలో దాతలు ఏర్పాటు చేసిన చేతుల శుభ్రం చేసుకొనే కుళాయిలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కాయిపాలెం ప్రధానోపాధ్యాయుడు భవనం భద్రిరెడ్డి మాట్లాడుతూ ఐటీసీ అనంబంధ సంస్థ ఫినిష్ సొసైటీ బ్రాంచి, తాను కొంత ఆర్థిక సహకారం అందించి స్కూల్‌లో ఆరు కుళాయిలతో కూడిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఫినిష్ సొసైటీ ప్రాజెక్ట్ టీం లీటర్ శ్రీరాజా, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసుల రెడ్డి, అనురాధ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నిసా బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం



నగదును ఎమ్మెల్యేకు అందిస్తున్న యాజమాన్యం

చీరాల: పట్టణంలోని స్వర్ణరోడ్‌లోని సత్యసాయి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత మద్రాస్ రోడ్డును అభివృద్ధి చేయాలి



మంత్రి జనార్దనరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పర్చూరు (చినగంజాం): పాత మద్రాస్ రోడ్డును అభివృద్ధి చేయాలంటూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. గురువారం ఆయన సెక్రటేరియట్‌లోని మంత్రి పేషీలో ఆయనను కలిసి మాట్లాడారు. గుంటూరు, ఒంగోలు వయా ప్రత్తిపాడు రోడ్డు అభివృద్ధితో ఈ ప్రాంత రూపురేఖలు మారతాయని ఆయన మంత్రి తెలియజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కన్నీటి సాగు

- అన్నదాతల ఆశలు ఆవిరి
- దిగువకు రాని కొమ్మమూరు కాలువ నీరు
- గండ్లు పడటంలో 4 అడుగులకు పడిపోయిన నీటి మట్టం
- నిద్రపోతున్న అధికారులు



కారంచేడు-కుంకలమర్రు రోడ్డులో పంట కాలువను బాగుచేస్తున్న పొక్లెయిన్



కారంచేడు యూటీ వద్ద నాలుగు అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం స్కేల్

కారంచేడు: కూటమి ప్రభుత్వం కారణంగా రైతులు అల్లాడిపోతున్నారు. రబీలో పంటలు పండించే తరుణంలో నీరు రాకపోవడంతో ఎండిపోయే దుస్థితి నెలకొంది. దీనికి తోడు అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. కొమ్మమూరు కాలువ ఆయకట్టు రైతులు కన్నీటిసాగు చేస్తున్నారు. తాము సాగు చేసిన వరి (వెద పద్ధతి, నారుమళ్లు) ఎండు దశలో ఉన్నాయి. దీంతో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు సమాయత్తమైన అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. అన్నదాతలు నీటి కోసం ఆర్తనాదాలు చేస్తున్నారు. ఎండిపోతున్న నారుమళ్లు, ఎదబెట్టిన పొలాలను చూసుకొని లబోదిబోమంటున్నారు. కొమ్మమూరు కాలువ నీటి ప్రవాహం నానాటికి దిగజారిపోతోంది. బుధవారం కారంచేడు యూటీ వద్ద నీటిమట్టం కేవలం నాలుగు అడుగులకు పడిపోయిందని రైతులు వాపోతున్నారు. నీటిమట్టం తగ్గుతుండటంతో అన్నదాతలు నారుమళ్లను ఎలా కాపాడుకోవాలని కన్నీటి పర్యంతమవుతున్నారు.

రైతు నెత్తిన గండ్లు..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కొమ్మమూరు ఆయకట్టు కింద సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు ఉంది. ఈపొలాల్లో ప్రస్తుతం ముమ్మరంగా వరినాట్లు వేయాల్సి ఉంది. కానీ ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అసమర్థత ఫలితంగా వరదల సమయంలో కొమ్మమూరు కాలువకు పడిన గండ్లను నాలుగు రోజుల్లో పూడ్చాల్సి ఉండగా ఇప్పటికీ ఆ గండ్లు పూడ్చలేదని అన్నదాతలో ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల జిల్లాలో అనేక చోట్ల ఈ గండ్లు పడ్డాయి. ప్రస్తుతం మళ్లీ చేబ్రోలు సమీపంలోని శేకూరువద్ద పడిన గండ్లతో నీటిమట్టం మరింత తగ్గుదల కనిపిస్తుంది. కాలువలో ఉన్న నీటినే దిగువకు పారేలా ఉన్న పంట కాలువలను సైతం అన్నదాతలు పొక్లెయిన్‌ల సహకారంతో కాలువలు తీయించుకుంటున్నారు. మరికొంత మంది రైతులు ఎత్తి పోసుకోవడం కనిపిస్తుంది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఆయిల్ ఇంజన్లు, కాలువల పూడిక తీతలతో అన్నదాతలు బిజీగా ఉంటున్నారు. ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ తమ బతుకులు ఎప్పుడూ ఇంతే అని వారికి వారే నిందించుకుంటున్నారు. ఇప్పటికే పెరిగిన విత్తనాలు, ఎరువులు, కౌలు రేట్లతోనే అల్లాడుతున్న అన్నదాతలు నీటి ఖర్చులు అదనపు భారంగా మారతున్నాయని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

మార్టూరు: అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొంటున్న జిల్లా రైతాంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మండల రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ కు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. జోన్ టు పరిధిలోని కాలువ చివరి భూములకు సాగర్ నీటిని ఏప్రిల్ నెలాఖరు వరకు పంపిణీ చేయాలని, రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఇస్తానని ప్రకటించిన రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని తక్షణం విడుదల చేయాలన్నారు. వ్యవసాయ మోటార్లు గృహ అవసరాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తాననే జీవో నెంబర్-22ను తక్షణ రద్దు చేయాలని, ఈనాం భూములు సాగు చేసే రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎరువుల షాపు యజమానులు కాంప్లెక్స్ ఎరువులతో లింకు పెట్టకుండా రైతులకు యూరియా విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి సాంబశివరావు వి కృష్ణమూర్తి, వై రాంబాబు, బత్తుల హనుమంతరావు, మోహన్‌రావు, కోటేశ్వరరావు, శివ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

సీవేజ్ వాటర్ డంప్ చేస్తే చర్యలు

- సెప్టిక్ ట్యాంక్ వాహనదారులు నిబంధనలు పాటించాలి

చీరాల: పట్టణ పరిధిలోని సెప్టిక్ ట్యాంక్ వాహనదారులు రోజువారీ వచ్చే సీవేజ్ వాటర్‌ను రోడ్డు పక్కన, ఏ ప్రాంతంలో కూడా డంప్ చేయవద్దని మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో సెప్టిక్ ట్యాంక్ వాహనదారులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వారి నిబంధనల మేరకు పురపాలక సంఘం వారిచే రామాపురంలో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నందు ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీపీలో మాత్రం డంప్ చేయాలన్నారు. నిబంధనల విరుద్ధంగా సీవేజ్ వాటర్‌ను డంప్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

త్రుణధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



గోవాడలో పోషకాహారం అందిస్తున్న సీడీపీవో

వేటపాలెం: చిన్నారులు దృఢంగా ఉండాలంటే తృణధాన్యాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఏసీడీపీఓ ఎం సుచిత్ర సూచించారు. పందిళ్లపల్లి సెక్టార్ పరిధిలో పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని పిల్లలకు తప్పనిసరిగా పెట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె పరిశీలించి అభినందించారు. చిన్నపిల్లలు బాగుంటేనే దేశ భవిష్యత్ బాగుంటుందన్నారు. అనంతరం బియ్యం, కందిపప్పు, నూనె, బాల సంజీవిని, బాలమృతం, పాలు, గుడ్లు అర్హులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రేడ్ వన్ సూపర్‌వైజర్ సజ్జా పుష్పవల్లి, ఇమాంబి, ఎస్ఎఎం విజయ్ కుమారి, గాయత్రి, భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్ పద్మ, పి సుజాత, జి పద్మ, హెప్సిబా, సీయోను కుమారి, షకీలా, తల్లులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమం

అద్దంకి: పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని కొరిశపాడు ఐసీడీఎస్ సెక్టర్ సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గోవాడ పంచాయతీలోని గోవాద అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు రక్తహీత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పీ రాధ, ఎం జ్యోతి,ఇందిరమ్మ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కుముద్వతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం అర్బన్‌లోని సీ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పేద వృద్ధులకు వస్త్రదానం



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులోని అమ్మ అనాథ ఆశ్రమం వృద్ధులకు దాతలు గురువారం నూతన వస్త్రదానం చేశారు. మార్టూరుకు చెందిన షేక్ నాగూర్ వలి, భక్తవత్సల దంపతులు ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, భాద్రపద మాసం, రేవతి నక్షత్రం, తదియ తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అవకతవకలకు తావు లేకుండా పనులు



ప్రజావేదికలో ఎంపీపీ వాసుబాబు, పీడీ, అధికారులు

కారంచేడు: జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎక్కడా ఎలాంటి అవినీతి, అవకతవకలకు తావు లేకుండా జరిపించేలా పనులు చేపట్టామని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అన్నారు. గురువారం మండల కేంద్రమైన కారంచేడు మండల పరిషత్ సమావేశ హాలు వద్ద నిర్వహించిన మండల స్థాయి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ విషయమై జరిగిన ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు గ్రామాల్లో జరిగిన పనుల్లో ఈ నెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించామని అధికారులు తెలిపారు. బాపట్ల డ్వామా పీడీ వీ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రజావేదికలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులు, పనుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల్లో వచ్చిన వినతులు, ఫిర్యాదులను పరిశీలించి అవినీతి జరిగినట్లు రుజువులు ఉంటే తప్పకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీడీపీఎం ఈశ్వర్, ఎంపీడీఓ పీ లక్ష్మీ నారాయణ, ఏపీడీ సువార్త, హెచ్ఆర్ మేనేజర్ చంద్రశేఖర్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ, కారంచేడు ఏపీఓ డీ బుల్లెయ్య, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చీరాల టౌన్: భాష్యం విద్యాసంస్థల్లో విద్యార్థులకు చదువుతో పాటుగా క్రీడలు, యోగ, కరాటే క్రీడలకు అధికప్రాధాన్యత ఇస్తుండటం వలనే పతకాలు సాధిస్తున్నారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శిరీషలు తెలిపారు. ఈనెల 16,17 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 49వ ఏపీ యోగాసన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ఎస్.శశినిత్యశ్రీ ప్రతిభ చూపి పతకాలు సాధించడంతో గురువారం స్కూల్లో అభినందించారు. అలానే అక్టోబర్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి యోగాసన పోటీలకు అర్హత సాధించిందని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరామ క్షేత్రాల వలే వెలుగొందాలి



పూజలు చేస్తున్న స్వామివారు

అద్దంకి: శింగరకొండలోని రామనామ స్థూపం అయోధ్య, భద్రాచలం వలే వెలుగొందాలని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి అన్నారు. ఆయన గురువారం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శింగకొండలోని రమ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీనిలో భాగంగా స్వామీజీని మంగళవాయిద్యాలతో ఆహ్వానం పలికారు. ఆయన మాట్లాడుతూ వ్యాసాశ్రమం పీఠం తరుపున స్వామీజీ రూ.40 వేలు ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ వెంకట సుబ్బారావు, సోడా వెంకటేశ్వర్లు, 100 మంది భక్తులు పాల్గొన్నారు.

వరిలో విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మోహనరావు

స్వర్ణ (కారంచేడు): వరిసాగులో ముందుగా అన్నదాతలు తప్పకుండా విత్తనశుద్ధి చేసుకోవాల్సి ఉందని పర్చూరు ఏడీఏ ఎన్ మోహనరావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో అన్నదాతలకు వరిసాగులో తీసుకోవాల్సిన అనేక మెళకువలను తెలియజేశారు. ప్రస్తుతం వరి సాగు చేపడుతున్న రైతులు తప్పకుండా ముందుగానే విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. తద్వార చీడ, పీడల బారిన పడకుండా పంటలను కాపాడుకోవడమే కాకుండ మంచి దిగుబడులు సైతం సాధించవచ్చన్నారు. అలాగే ఎరువులను కూడా విస్తారంగా వాడకూడదన్నారు. ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యంపై అన్నదాతలు అవగాహన కలిగి ఉండాలన్నారు. విత్తనశుద్ధితో 15-40 రోజుల్లో జరిగే వ్యవసాయంలో ఎలాంటి తెగుళ్లు రాకుండా ఉంటాయన్నారు. అలాగే రైతులు తాము సాగు చేసిన పంట వివరాలను తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వార పంట నమోదు, ఈ-క్రాప్ నమోదులను తప్పకుండా చేయించుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, ఉచిత పంటల బీమా, ధాన్య సేకరణ వంటివి అందుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు సహకరించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రఫీ

మేదరమెట్ల: సమాజంలో ఎయిడ్స్ నిర్మూలనకు యువత కృషి చేయాలని మేదరమెట్ల ఎస్సై ఎస్కే రఫీ అన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్ ఆవరణలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు, యువత కొంతమంది మత్తుపదార్థాలకు బానిసలై విచ్చలవిడి శృంగారానికి పాల్పడుతున్నారన్నారు. తద్వారా చిన్న వయసులోనే హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల బారినపడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. హెల్ప్ టీఐ బీవీసాగర్ మాట్లాడుతూ వ్యాధి సోకిన వారి పట్ల సమాజంలో వివక్షత చూపించకూడదన్నారు. వ్యాధి సోకిన వారికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు, మందులు అందజేస్తారని తెలపారు. శానం శ్రీనివాసరావు, ఆశీర్వాదం, రాధ, భార్గవ్, కృష్ణవేణి, దుర్గాబీ, సువార్త నయోమీ, శారద విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది



ఏరియా వైద్యశాలలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

చీరాల: అన్నదానం అన్నీదానాల్లో కల్లా అత్యంత గొప్పదని.. చీరాల ఏరియా వైద్యశాలకు వచ్చే రోగులకు ప్రతీ రోజు అన్నదానం చేయడం దైవకార్యంతో సమానమని కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ అన్నారు. గురువారం చీరాల ఏరియా వైద్యశాల్లో కామాక్షి హాస్పిటల్ సహకారంతో వైద్యశాలకు వచ్చే రోగులకు చైతన్య నిత్య అన్నదాన పథకంలో భాగంగా రోగులు, అటెండర్లకు ఉచితంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నిత్య అన్నదాన పథకంలో భాగంగా ప్రతీరోజు రోగులకు అన్నదానం చేయడం గొప్పకార్యమన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతుగా సేవా కార్యక్రమాలను చేయాలని దేవరాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి, ప్రతినిధులు వెంకన్నబాబు, శర్మ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన సీజనల్ వ్యాధులకు గురికారని.. ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతి ఒక్కరూ శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో కె.నేతాజీ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా-2024లో భాగంగా గురువారం గ్రామ పంచాయతీల్లో వైద్య సిబ్బందితో కలిసి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆయా పంచాయతీలు, సచివాలయాల సెక్రటరీల ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కలిసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు అందించే వ్యాక్సిన్లను క్రమం తప్పకుండా వేయాలన్నారు. గ్రామసభల్లో సెక్రటరీలు, గ్రామ ప్రజలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బల్లికురవ: కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈఘటన మండలంలోని కొప్పెరపాడు సిమెంట్ షాప్ వద్ద గురువారం జరిగింది. అందిన వివరాల మేరకు.. కొప్పెరపాడు గ్రామానికి చెందిన కుంచపు అనిల్, నందా రమణమ్మ ఇద్దరూ రోజువారీ బేల్దారి పనులు నిమిత్తం అద్దంకి వెళ్తున్నారు. ఈ క్రమంలో కొప్పెరపాడులోని సిమెంట్ షాప్ వద్ద గుర్తు తెలియని కారు లారీని ఓవర్ టేక్ చేస్తూ బైక్‌ను వెనుక వైపు బలంగా ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న అనిల్, రమణమ్మలకు బలమైన గాయాలు కావడంతో ఇద్దరిని నరసరావుపేట ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

ఎత్తిపోతల పథకం మోటార్లు చోరీ



ఎత్తిపోతల పథకం



చోరీకి గురైన ఎత్తిపోతల పథక మోటార్లు

బల్లికురవ: దొంగలు పథకం ప్రకారం ఎత్తిపోతల పథకంలోని మోటార్లు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి బల్లికురవ-అద్దంకి ఆర్ అండ్‌బీ రోడ్‌లోని పెదఅంబడిపూడి గ్రామ సమీపంలో జరిగింది. అందించిన సమాచారం ప్రకారం పెదఅంబడిపూడి, చిన్నఅంబడిపూడి గ్రామాలకు చెందిన రైతులు అంబడిపూడి చెరువు ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 400 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. దొంగల పథకం ప్రకారం మోటార్లు దొంగలించడంతో సాగు ప్రశ్నార్థకమేనని రైతులు లబోదిబోమంటున్నారు. దొంగలించిన మోటార్‌ల విలువ సుమారు రూ. 5 లక్షల పైచిలుకు ఉంటుందని రైతులు వివరించారు. ఇప్పటికైనా దొంగతనాలకు కళ్లెం వేసి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.